35

# గర్వభంగం

ఒక ఊరిలో పశుపతినాథ్ అనే రైతు ఉండేవాడు.

అతని దగ్గర వందకిపైగా కోళ్ళుండేవి. వాటిలో ఒకటి మగ కోడి! అది పుట్టినప్పటినుంచి ఎంతో ముద్దుగా బొద్దుగా ఉండేది. అందుచేత పశుపతినాథ్ దానిని ఎంతో ప్రత్యేక శ్రద్ధతో పెంచసాగాడు. పోషణకు తగినట్లుగా ఆ కోడి రోజురోజుకీ మరింత నవనవ లాడుతూ పెరగసాగింది. పశుపతినాథ్ దాని వంక గంటల తరబడి చూస్తూ సంతోషంగా గడిపేవాడు.

క్రమంగా అది ఎదిగి కోడిపుంజు అయింది. యజమాని తనను ప్రత్యేకంగా చూస్తుండడంతో తనంతటిది లేదన్న గర్వం దానికి బాగా పెరిగింది. దాని ధాటికి ఆగలేక మిగిలిన కోళ్ళన్నీ దానిని తమ నాయకునిగా గుర్తించసాగాయి.

దాంతో... ఆ కోడిపుంజు పొగరు మరింత పెరిగి సాటి కోళ్ళను అవమానించడం, ముక్కుతో పొడవడం వంటివి చేయసాగింది. ఈ బాధ పడలేక ఆ కోళ్ళన్నీ - 'ఈ పీడ ఎప్పుడు విరగడ అవుతుందిరా దేవుడా..?' అంటూ రోజులు లెక్కపెట్టుకోసాగాయి.

ఒక రోజున ఈ పొగరుబోతు కోడిపుంజు ఆహారం ఏరుకోవడానికి వెళ్ళింది. అక్కడ ఒక పిల్లి పడుకుని ఉంది. దానిని చూడగానే కోడికి ఎక్కడలేని కోపం వచ్చింది.

"ఇది నేను ఆహారం వెతుక్కునే చోటని తెలియదా? లేచిపో" అని గట్టిగా గదమాయించింది.

"నేను చాలా అలసటగా వున్నాను. నువ్వు ఆ వైపుగా పురుగులు ఏరుకోరాదా?" అంది పిల్లి మర్యాదగా.

"నన్నెదిరించి మాట్లాడుతావా?" అంటూ ఆ పిల్లి మీదికి దూకి తన వాడిముక్కుతో దానిని పొడవసాగింది కోడి.



పిల్లి కోపంగా లేచింది . ఆ కోడి గొంతుని కసుక్కున కొరకబోయింది . కాని , అంతలోనే ఆ అలజడికి పశుపతినాథ్ అటు కర్రతో రావడంతో పిల్లి భయపడి పారిపోయింది.

తన ప్రతాపానికి భయపడే పిల్లి పారిపోయిందని భ్రమపడింది కోడిపుంజు.

తన గొప్ప మిగిలిన కోళ్ళ ముందు చెప్పసాగింది . అడ్డూ అదుపూ లేని గర్వంతో, యజమాని తనకి అండగా వున్నాడన్న ధీమాతో అది మరింత రెచ్చిపోయింది . చిన్న పిల్లలు అన్నం తింటుంటే కలియబడి వాళ్ళ చేతుల్లోంచి అన్నం కాజేయడం మొదలు పెట్టింది . అది చూసి చిన్న పిల్లలు ఆ కోడి వస్తోందంటేనే... భయపడి దూరంగా పోసాగారు.

కోడిపుంజు ఆగడాలు మితిమీరడంతో మిగిలిన కోళ్ళన్నీ ముందుగా ఆలోచించుకుని ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసుకున్నాయి. దానికి ముఖ్య అతిథిగా పొగరుమోతు కోడిపుంజుని పిలిచాయి.

కోళ్ళలో పెద్ద కోడి లేచి , "మనుషులు ఎంతో తెలివైన వారు. చాలా బలవంతులు. అటువంటి వారిని అదుపులో పెట్టిన మన మిత్రుడు కోడిజాతికే గర్వకారణం ! అందువల్ల ఆయనని మన మహారాజుగా ఎన్నుకోవాలి" అని సూచించింది .

"ఆ మాట నిజమే ! మన తాత-ముత్తాతల నుండి మనకి అసలైన శత్రువు నక్క ఉంది దానిని ముందుగా మట్టు పెట్టాలి. దానికి మన మిత్రుడొక్కడే తగినవాడు. ఆ నక్క అంతు చూసినట్లయితే మన జాతిని రక్షించినట్లవుతుంది" అంది మరో కోడి .

ఆ విధంగా సాటికోళ్ళు ఘనంగా పొగిడేసరికి పొగరుబోతు కోడి ఉబ్బితబ్బిబ్బైపోయింది.

ఆ ఉత్సాహంతో ముందూ వెనకా ఆలోచించకుండా "ఓస్... అదెంత పని? ఆ నక్కని నేను మట్టు పెట్టేస్తాను. అదెక్కడుందో చూపించండి!" అంది .

"అదిగో... నక్క ఆ అడవిలో వుంది !" అని చూపించాయి కోళ్ళు.

పొగరుబోతు కోడి అడవిలోకి వెళ్ళి, "ఎక్కడా... నక్క ఎక్కడా?" అంటూ అరుస్తూ వెదకసాగింది.

కొంచెంసేపట్లోనే ఒక పెద్ద నక్క దానికి ఎదురయింది . దానిని చూడగానే అత్యుత్సాహంతో ఒక్క ఎగురు ఎగిరి మీదపడి ముక్కుతో పొడవసాగింది పొగరుబోతు కోడిపుంజు.

అయితే... అదెంతసేపు ? మరుక్షణంలో నక్క తిరుగబడి ఆ కోడి మెడని కటుక్కున కొరికి ఈడ్చుకుపోయింది. తర్వాత కడుపారా దానిని తిని హాయిగా పడుకుంది .

అంతటితో కోడిపుంజు పీడ విరగడైనందుకు మిగిలిన కోళ్ళన్నీ హాయిగా ఊపిరి పీల్చుకున్నాయి.

★★★